సర్వ సంపత్సమృద్ధశ్చస్స మహావైభవ పూర్వకం ।
పుత్రికాణాం చ పుత్రాణాం వివాహా నకరోత్స్వయం ।
చిరం ధర్మేణ తద్రాజ్యం కృత్వా సంపాద్య సద్యశః ।
అవాస్య నిఖిలాన్భోగా నృశ్చాద్వై కుంఠ మాప్తవాన్ ।

+++

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

## శ్రీ రామ చంద్రపరబ్రహ్మణే నమః

## నిత్యాన్న దాన వ్రత కథా ప్రారంభము

పూర్వమొకప్పుడు నైమి శారణ్య వాసులైన శౌనకాది మహర్షులు లోక కల్యాణమును కాంక్షించి ద్వాదశాబ్దములు చేయదగిన సత్రయాగమును ప్రారంభించిరి. ఆ యాగమును చూచి తరించుటకై మార్కండేయాత్రి వసిష్టాది మహర్షులక్కడ కు వచ్చిరి. ఒకనాడు బహుధర్మజ్ఞుడు, సర్వ శాస్త్రవిశారదుడు, అష్టాదశ పురాణములు చెప్పుటయందు నేర్పరి, వేద వ్యాస మహర్షి యొక్క ముఖ్య శిష్యుడునై నరో మహర్షుణుని కుమారుడగు సూతుడు శిష్యులతో కూడి యక్కడకు వచ్చెను. శౌనకాది మహర్షులు ఆ వచ్చు సూతుని గాంచి వాని కెదురు పోయి తెచ్చి సింహాసనమున కూర్చుండ పెట్టిరి. ఆ సూతుని యనుమతితో మహర్షులును తమ తమ యా సనముల



Scanned by CamScanner

నధిష్టించిరి. అంత శౌనక మహర్షి చేతులు జోడించి మునులందరు వినుచుండగా ఆ సూతునితో నిట్లనెను.

ఓ సూత మహర్షీ! నీవు వ్యాసుని చేత ననుగ్రహింపబడిన సకల ధర్మములను ఎరిగిన వాడవు. గుణవంతుడవు, ఇంక కలికాలము రాబోవుచున్నది. అది సర్వలోక బాధావహము కాగలదు. జనులందరు ఆ యుగమున దుఃఖితుల గుదురు. నానారోగ బాధా పీడితులు కాగలరు. కావున ప్రజాహితము గోరి సర్వదుఃఖములను బోగొట్టి, సకల సంపదలను శుభములను కలిగించుచూ కోరికలనీడేర్చు నొక వ్రతమును చెప్పుము, ఈ మహర్షులందరు నీ మాటలాలకించుటకు ఉవ్విళ్లూరుచున్నారు. అనగా సూతులవారు మిక్కిలి ఆనందించి, ఓ మహర్షులారా! మీరు ఎంతయో ధన్యాత్ములు కావుననే లోకహితమును గూర్చి ప్రశ్నించియున్నారు. మీకు ఒక ఇతి హాసమును చెప్పుచున్నాను. సావధాన చిత్తుల రయి ఆలకింపుడు. అది విష్ణు నారద సంవాద్కరూపముననున్నది. సర్వ సంపదలను ఇచ్చునది, ధన ధాన్య ప్రవర్ధకమయినది.

పూర్వము నారదుడు సర్వలోకములు సంచరించుచూ భూలోకమును చూచుటకు వచ్చెను. ఇందలి జనులందరునూ పూర్వకృత పాపకర్మ ఫలవిశేషముచే మహాదరిద్రులై యుండిరి.



Scanned by CamScanner

అంత మాత్రముగాక పుణ్యపాప విచక్షణ మింతయు లేక పరులను వంచించుచూ, సత్య శౌచములను విడిచి పశుప్రాయులయ యుండిరి. నానా దుఃఖములు కుడుచుచూ ధర్మార్థ కామమోక్షములకు దూరమై పోయిరి. వారిని చూచిన నారదునకు అంతరంగమున జాలిపుట్టినది. ఎట్టైన వీరిని దుఃఖముల నుండి యుద్ధరింప వలయునని తలచి వైకుంఠనగరమునకే గెను.

అక్కడ నారాయణుడు శ్రీ భూనీలాసమేతుడైయుండెను. స్వామి శంఖచక్రగదావద్మములతో కూడిన చతుర్బాహుండైయుండెను. కోటి సూర్య ప్రభా భాసమానుడై వెలుగొందుచుండెను. వాని కన్నులు తామరపద్మముల వలె నున్నవి. పీతాంబరము దాల్చినాడు. మెడలో కౌస్తుభాభరణము ప్రకాశించుచున్నది. నీల మేఘచ్ఛాయ గల దేహము గలవాడు నానా లంకారయుక్తుడు, శేష శయ్యపై కోటి మన్మధుల సొగసుతో వెలుగుచున్నాడు. బ్రహ్మరుద్రాది దేవతలచే పూజింపబడువాడునైయుండెను. ఆ మహావిష్ణువును చూచి నారదుడిట్లుస్తుతించెను.

దేవాది దేవా! జగన్నాధా నీకు నమస్కారము. ఓ పుండరీకాక్ష! పద్మనాభా! నీకు వందనములు. నీవు సత్య



Scanned by CamScanner

రజస్తమోగుణములతో బ్రహ్మవిష్ణు శివాక్రతులను దాల్చినావు. సృష్టి స్థితిలయ కారకుడవు. భక్త జనులను రక్షించుటకూ, ధర్మమును రక్షించుటకునూ బహురూప ములను దాల్చుచున్నావు. నీకివే నా నమస్కారములు. అని పల్కు నారదుని స్తోత్రమునకు పరమానంధమును బొంది నారాయణుడు "నారదా! నీవు చేసిన స్తోత్రమునకు సంతసించితిని. నీవు వచ్చుటకు కారణ మోమియో తెల్పుము. అది యెంత దుర్లభమ్మయిన దైననూ చేయుదును. అని మాటయిచ్చెను. వెంటనే నారదుడు".

స్వామీ! భూమిపై జనులందరు పాపకర్మ విశేషముచే పీడింపబడుచున్నారు. ఎట్లనగా కొందరు భోగ శూన్యులు, కొందరు అన్నరహితులు, కొందరు గృహహీనులు, కొందరు అలంకారములు లేని వారు, కొందరు భూములు లేనివారు, కొందరు జ్ఞాన శూన్యులు, కొందరు బోగ వర్జితులు, కొందరు అల్పాయుష్కులు, కొందరు శౌచములు లేని వారు. హారకముగా నందరును వేరు వేరు బాధలతో మ్రగ్గిపోవు చున్నారు. నేను స్వయముగా వారిని చూచి కరిగిపోయి తద్దుఃఖ మిమ్ముదర్శించి వారిని ఉద్ధరింప గోరివచ్చినాను. నివారణోపా యమును ప్రసాధింపుము తండ్రీ! నారాయణా! అనెను. దానికి సంతోషించి నారాయణుడు నారదునితో-

Scanned by CamScanner

నారదా! నీవు ధన్యుడవు. కృతార్థుడవు, పరోపకారబుద్ధి గలవారి నడత లిట్టు లేయుండును నీకు "నిత్యాన్నదాన వ్రతము"ను గూర్చి చెప్పుచున్నాను. వినుము. ఇది సర్వపాపములను కడిగి సంపదలిచ్చునది. పరమ రహస్యమైనది. కోరిన కోర్కులను దీర్చును ఇదిచేసిన వారికి ఇహమున సంపదలు కల్గుట మాత్రమే గాదు. ఏ లోకమునందునూ ఏ జన్మమునందునూ దారిద్ర్య బాధ కలుగదు. ఈ వ్రతము లోకమున వ్యాప్తమయిన నాటి నుండియే సర్వదారిద్ర్య గాఢాంధత మస్సులును పోవును. పర్వతములందు మేరు పర్వతమునూ, సముద్రములందు పాల సముద్రము, తేజస్సులలో సూర్యుడునూ ఎట్లు శ్రేష్టములో అట్లే వ్రతములలో నీ నిత్యాన్నదానవ్రతమంత శ్రేష్ఠమైనది అనెను. అంత నారదుడు "స్వామీ! తమరు చెప్పు అన్నదానవ్రత చర్యా స్వభావములెట్టివో, ఇది యెప్పుడు చేయదగునో ఏయే వస్తువులు ముఖ్యములో ఆ సర్వమును దెల్పి నన్ను అనుగ్రహింపుడని ప్రార్థించెను. ఆ మాటలకు శ్రీమన్నారాయణుడు సంతసించి.

వత్సా ! నారదా ! చెప్పుచున్నాను వినుము. మాఘాది పంచ మాసములు దానికి ముఖ్యమైనవి. శ్రీభూనీలా సహితుడనయిన నన్ను భక్తితో పూజింపవలెను. ఆపైన చెప్పిన



Scanned by CamScanner

మాసములలో, పూర్ణిమ మొదలు కొని గాని ఏకాదశీ తిథి నుండిగాని ప్రారంభించి ఒక్క సంవత్సరము పాటు ప్రతి నిత్యము భక్తితో బ్రాహ్మణునకు భోజనముపెట్టవలెను. ఇది వ్రత విధానము. ఇంక ఉద్యాపనమును వివరించుచున్నాను. శ్రద్ధగా వినుము.

ఈ ఉద్యాపనమును వ్రతారంభమునగాని, వ్రత మధ్యను గాని, వ్రతాంతమున గాని చేయవలెను. ఏ రోజున తాను ఉద్యాపనము చేయతలంచెనో ఆనాడు ప్రాతః కాలమున లేచి నిత్యకృత్యములు నిర్వర్తించి, నదీ తీరమున స్నానము చేసి శుచియై పూజాస్థానమును ప్రవేశింపవలెను. అచ్చట పంచ విధములైన చూర్ణములతో రంగవల్లులు పెట్టవలెను. వానిపై విశాలమైనది, దశలతో గూడినది గట్టిది అయిన నూతన వస్త్రమును ఉంచవలెను. అచ్చట దానిపై ధాన్య రాశిని పోయవలెను. ధాన్యరాశి ప్రమాణ మెంతయనగా ఆరువందల కుంచములు. అనగా సుమారు ఇరువది అయిదు బస్తాలు. అంత ఆ ధాన్యరాశిని బంగారు సూత్రముతో చుట్టును చుట్టవలెను. ఆ బంగారము కర్ష మాత్ర ప్రమాణమునకు తగ్గక యుండవలెను. కర్షమనగా పదునారు మాషములు యెత్తు. అంత ఆధాన్యరాశిపై క్రొత్త వస్త్రమునుంచి దాని మధ్య కుంచెడు బియ్యమును పోసి యందు కలశమును

Scanned by CamScanner

స్థాపింపవలెను. ఆ కలశ బంగారముతో నిర్మించినదయిన ఉత్తమము. రజిత నిర్మితము మధ్యమము, రాగి పాత్రయయిన ఇత్తడిదయినను కావచ్చును. ఈ కలశాపై మరియొక నూతన వస్త్రము నుంచి తన్మధ్యకర్ష మాత్ర నిర్మితమైన నా ప్రతిమను ఉంచవలెను. ఆ కలశమునకు ముందు సపర్షులను పూజింపవలెను. దక్షిణమున పార్వతీ పరమేశ్వరులనూ, పశ్చిమమున నవగ్రహములను ఉత్తరమున సరస్వతీ బ్రహ్మలనూ, ఆవాహన పూర్వకముగా పూజింప వలెను. పిమ్మట వాహనమైన గరుత్మంతుని, బలాధికుడైన విష్వక్సేనుని, నాశయ్యామైన ఆది శేషుని, 1. సనక 2. సనందన 3. సనత్కుమార 4. సనత్సుజాతులను నలుగురు మునులను నాల్గుదిక్కులందును నుంచి పూజించవలెను. అష్టదిక్పాలకులైన ఇంద్రాదులను అష్టదిక్కులందును పూజించవలెను. అంత ఆ మంటపమధ్యమున శ్రీ భూనీలా సమేతుడనైన నన్ను షోడశోపచారముల చేత పూజింపవలెను. ఇట్లు పూజా విధానమున యథా శాస్త్రము జరిపించి ఆ సర్వస్వమును ఇంటి పురోహితునకు దక్షిణతో సహా దానముచేయవలయును. ఇంకనూ గోదానము, భూదానము, కన్యాదానము, కాంస్యపాత్ర దానమునూ చేయవలెను. దీని వలన వ్రత సిద్ధి శీఘ్రముగా కల్గును. ఇట్లుచేసి ముఖ్యముగా

Scanned by CamScanner

హితులతో బంధువులతో గూడి నిత్యాన్నదాన వ్రత కథను వినవలెను. బ్రాహ్మణులకు సత్కారములు చేయవలెను. బ్రాహ్మణులకును బంధువులకును ఉత్తమమైన భోజనమును పెట్టవలెను. ఇట్లు ఈ వ్రతమును ఆచరించినవాడు సర్వ దుఃఖముల నుండి విముక్తుడగును. ఈ జన్మమున భుక్తిని పొందును. అంతమున ముక్తిని పొందును. అని చెప్పెను.

సూతుడు మహర్షులారా! ఇది విష్ణు మూర్తిచే చెప్పబడినది. అంత నారదుడు శ్రీ హరిచే అను జ్ఞాతుడయి వచ్చి వ్యాస మహర్షికి చెప్పెను. ఆయన మా తండ్రియైన రోమహర్షునకు చెప్పెను. ఆయనయు దీనిని మాకుదెల్పెను. నేను మీకు దెల్పితిని. అనెను.

ఇది స్కాంద పురాణమున అన్నదాన మహత్త్వమున నిత్యాన్నదాన కథయందు ప్రథమాధ్యాయము సమాప్తము.

+++

## అథ ద్వితీయాధ్యాయము ప్రారంభము

ఇది విన్న మహర్షులు ఓయి సూతుడా నీవు చెప్పిన ఈ వ్రతము అత్యద్భుతము. పవిత్రము. ఈ వ్రతమును పూర్వమెవనిచే చేయబడినది. ఆతడెట్టి ఫలము పొందెనో అది



Scanned by CamScanner

కూడ వినిపించవయ్యా! అనగా సూతుడు

మహర్షులారా! ఒక విచిత్రమైన ఇతి హాసమును చెప్పుచున్నాను. అది పవిత్రమైనది. పాపములను పోగొట్టునది. శ్రద్ధగా వినుడు.

పూర్వము పరమ పవిత్రమైన ఈ భరత ఖండమునందు మహారాష్ట్ర దేశమున శ్రీ పురమను గ్రామమొకటి యుండెను. అందు 'ధర్మ నిష్ఠుడ"ను బ్రాహ్మణుడొక్కడుండెను. వాని భార్య "సుమతి" యున్నది. పతివ్రత దంపతులకు సంతానము కలుగలేదు. వయస్సు దాటినది. అయినను వానికి తపశ్శక్తి చేపుత్రోదయమైనది. వీరికి తపోధనమే ధనముగాని ధనమే మాత్రములేదు. ఈ దంపతులకు కల్గిన పుత్రునకు తండ్రి 'సువృత్తుడను నామము పెట్టెను. ఆ సువృత్తుడు శుక్లపక్ష చంద్రుని వలె దినదినాభి వృద్ధి పొందెను. ఉపనయన వయస్సు రాగానే తండ్రి వానికి ఉపనయనము చేసి గురు కులమున కంపినాడు. అచట సుమతికి "సురథుడ"ను రాజ పుత్రునితో నెయ్యము కల్గినది. వారిద్దరు సకల విద్యలు అభ్యసించిరి. సువృత్తుడు గురుకులమున విద్యాభ్యాసము ముగించి గురువుల ఆజ్ఞను పొంది యింటికి వచ్చెను. తల్లిదండ్రులకు నమస్కరించి ఇంకను జ్ఞానాభ్యాసము చేయుటకై పెండ్లి మాట తలంపకుండెను తండ్రి వానిని చూచి

నాయనా! ఇట్లు బాల్యమున విరక్తుడవై యుండుట తగదు. గార్హపత్యమును పొందుము. అది ముఖమైన ధర్మము. నాల్గు ఆశ్రమములలోను గార్హపత్యమే మేటి. సంతానమును బడసి వంశాభివృద్ధి చేయుము. పున్నామ నరకము నుండి పుత్రుడొక్కడే రక్షించగలడు. కావుననే వానికి పుత్రుడను నామము వచ్చినది. అట్లయిన పితౄణము తీర్చిన వాడవగుదువు. కావున పుత్రా! గార్హపత్యమును పొందుమని బోధించెను. సువృత్తుడు తండ్రియాజ్ఞను శిరసావహించి "సుశీల" అను కన్యను గుణవతి అయిన కన్యను పెండ్లియాడెను. వాని పితరులు మోదమునమున్గిరి. కాలక్రమమున వాని పితరులు స్వర్గస్థులైరి. వారికి ఔర్ధ్వ దైహికములు ఆచరించి యాతడు ఇట్లు తలచెను. బంధువులు లేని ఈ గ్రామమును నుండిన నాకేమి ప్రయోజనము. ఎక్కడికైన నొక నదీ తీరమును చేరి తీవ్ర తపస్సు చేయుట మంచిది" అని నిర్ణయించి కుల క్రమాగత దారిద్ర్యముచే పీడింపబడుచు గంగా తీరమును చేరి అటు ఉంచ వృత్తితో అయాచి వ్రతముతో కాలమును గెంటుచుండెను. ఆ దంపతులకు అయిదుగురు కుమారులునూ అయిదుగురు కుమార్తెలును కల్గిరి. పాప మా పిల్లలు ఆకలికి తాళలేక తల్లిని చేరి అన్నము పెట్టుమని పీడింపజొచ్చిరి. ఆమె వారికి ఉన్న

అన్నమును పెట్టి తాను భర్తతో సహా గంజిత్రాగి కాలమును గడుపుచుండిరి. అదే వారికి తృప్తినిచ్చిన ఆహారము. లోకమునందు దారిద్ర్యమును మించిన దుఃఖములేదు.

ఒకనాడు సుశీల భర్తను చేరి దుఃఖించుచూ నాధా! మన సంతానము ఆకలితో నకనకలాడును కఠిన పాషాణ స్థలముననెట్లు పరుండిరో చూడుడు. వీరి కడుపునిండ నాహారము గాని, ఒంటినిండ గుడ్డకాని లేదయ్యోను. "దారిద్ర్యేణ సమం దుఃఖం నభూతో నభవిష్యతి" ఇట్టి దీనస్థితి శత్రువులకును కలుగకుండు గాక! నన్నును సంతానమును రక్షించుడు" అని ఏడ్చెను. ఆమె రోదనమునకు కరిగిపోయి సువృత్తుడు భార్యనోదార్చి కాంతా! ఎట్లైన ధనము సంపాదింతును దుఃఖింపకుము. నాకు సురధుడను బాల్యమిత్రుడు గలడు. ఆతడు నేడు మహారాజు. నేను వాని దగ్గరకు పోయి ధనమును యాచించి తీసికొని వత్తును. అంతవరకు నీవు బిడ్డలను పోషింపుము. అని ఓదార్చెను. తాను వచ్చు వరకు ఈమె బిడ్డలను పోషింపవలెను గదా? దానికి దగిన ధన మీయకున్నచో నీమెయెట్లు పోషింప గలదు? కావున కొంత ధనమును ఈమెకీయ వలయునని నిశ్చయించి ఆ గ్రామమందలి యొక గృహస్థునడిగెను. ఆతడును అయాచిత వ్రతుడైన ఆ సువృత్తునకు మహానందముతో

ఇరువదియైదురూపాయల నిచ్చెను. ఆ ధనమును చేత పట్టి వచ్చి భార్యకిచ్చి బాల్య మిత్రుడైన సురథుని దర్శించుటకు బయలు దేరి, నానా గ్రామములను, అటవులను, జన పదములను, కొండలను దాటి రాజ గృహ ద్వారము చేరెను. వానిని ద్వార పాలకులు అడ్డగించిరి. తన విషయమంతయు చెప్పి రాజున విన్నవింపుడని పంపెను. వారు లోనికి బోయి రాజునకు దెల్పిరి. రాజు వానిని లోనికి తీసికొని రండని ఆజ్ఞాపించెను. లోనికి వచ్చిన దరిద్ర బ్రాహ్మణుని చూచి రాజు "నీవెవడవు? ఎందుకు వచ్చితివి? నీపేరేమి? చెప్పుమనెను ఆ మాటలు విని ఆ బ్రాహ్మణుడు "మహారాజ! నన్ను మరచితివా; నేను సువృత్తుడను నీ సహాధ్యాయుడను. నిన్ను చూచుటకు వచ్చితిని. నేను దారిద్ర్యముతో బాధపడుచున్నాను. ధనమిచ్చి నా దారిద్ర్యమును బాపుము మిత్రమా! అనెను. ఆ మాటలకు రాజు కినిసి మదముతో చాలు చాలు ఇట్టి మాటలాడకుము. నీవెవడవాగనే నెరుగను. ఎందుండి వచ్చితివో అక్కడకు పొమ్ము వేమము ధనవంతులమైన రాజులము. నీవు దరిద్ర బ్రాహ్మణుడవు. నాకును నీకును స్నేహమెట్లు ప్రవర్తిల్లును? ధనవంతులకునూ దరిద్రులకును, పండితులకును మూర్ఖులకును, దుర్బలులకును బలవంతులకునూ స్నేహమెట్లు పొసగును.

పొమ్ము అని అనాదరము చేసి ధన మేమాత్రము నీయక పంపివైచెను.

అంత సువృత్తుడు నిరాశా బాధితుడై దుఃఖించెను. మహారణ్య మార్గమున వెనుదిరిగి పోవుచూ ఒక మహా తరువు మొదలు కూర్చుండి యిట్లు చింతించెను. "రాజు ధనమే మియు నీయడయ్యెను. అట భార్యా బిడ్డ"లు దారిద్ర్యముతో నల్లాడిపోవుచున్నారు. రిక్తహస్తములతో నింటికెట్లు పోగలను? ఇక్కడే బలాత్కారముగా ప్రాణములను విడుతును" అనుకొనుచున్న ఆ విప్రుని చింతను దీనదయాపరుడైన హరి గ్రహించి వృద్ధ బ్రాహ్మణ వేషమున వచ్చి "ఓ బ్రాహ్మణుఁడా ఈ యరణ్యమున ఏకాకివై ఏల దుఃఖించుచునావు. నీ కథ చెప్ప తగినదైన చెప్పు" యనెను. సువృత్తుడా మాటలకు "అయ్యా! నీవు నా కథవిని ఏమి చేయగలవు? ఈనాబాధను నారాయణుడొక్కడే హరించగలడు. ఇతరులకిది తీర్పరానిది. అనెను. దానికా వృద్ధుడు "ఓయీ! చెప్పుము శక్తిగల్గినచో హరింతును. లేకున్న నీతో సహా చింతింతును" అనెను. సువృత్తుడు అప్పుడు-

అయ్యా! మహారాష్ట్రమున శ్రీపురమను గ్రామముగలదు. అందు సువృత్తుడననేనొక దరిద్ర బ్రాహ్మణుడను. నా భార్య



Scanned by CamScanner

సుశీల, మాకు సంతానము పదిమంది సంతతిని పెంచుటకు బాల్య మిత్రుడును, సహోధ్యాయుడునయిన సురథుడను వానిని ధనము యాచించితిని. ఆ రాజు నా కోరికను తిరస్కరించెను. వృధా ప్రయాసయయి నది. ఆ కారణమున సహింపరాని దుఃఖము పొంగినది. మరణింపవలెనని యనుకొనుచున్నాను. ఇది నా సర్వ వృత్తాంతము తమకు చెప్పితిని అని విరమించెను. దుఃఖించెను.

అది విన్న విప్రరూపమున నున్న శ్రీమన్నారాయణుడు ఓ బ్రాహ్మణా! ఇంత మాత్రముచే సాహసము చేసి ప్రాణములు తీసికొందువా! ఆత్మహత్య మహాపాపమును మూటకట్టుకొందువా? ఆత్మహత్య మహాదోషమని యెరుగవా? ఏ పుణ్య కార్యము చేసిన దారిద్ర్యము హరించునో ఆ కార్యమును చెప్పుదును సావధాన మనస్సుతో వినుము.

ఓయీ! నిత్యాన్నదానాఖ్య వ్రత మొక్కటి యున్నది. అది స్త్రీలును పురుషులునూ ఆచరింపదగినది. అది చేసిన సర్వ సంపదలు కలుగును. పుణ ప్రదము మహా పాపహరము. దానిని శ్రద్ధపట్టి యధా శాస్త్రము చేయుము. నీకు సర్వ సంపదలును కలుగగలవు.'' అని చెప్పి ఆ వ్రత

విధానమునంతటిని బోధించెను. 1. ధాన్యరాశి 2. స్వర్ణ సూత్రము 3. ప్రతిమ ముఖ్యములు అని మిగిలిన ముఖ్య వస్తువులనన్నింటిని వాని ప్రమాణములనూ వివరించి చెప్పెను.

సువృత్తుడా మాటలు విని "మహాత్మా! మీ మాటలకు భయము కలుగుచున్నది. ఇది ధనవంతులకు సాధ్యముగాని నావంటి దరిద్రులకు శక్యమెట్లగుననెను. దానికి ఆ వృద్ధ బ్రాహ్మణుడు సువ్రత! దానికొక యుపాయముంది చెప్పుచున్నాను విను. పూర్వమొక రాజు సూర్యవంశము వాడు, శాశ్వత స్వర్గసౌఖ్యమును కోరి ఇచ్చుట ఈనన మందు ఒక యాగముచేసినాడు. ఆ యజ్ఞోపకరణములన్నియును సువర్ణ నిర్మితములే యజ్ఞ పరిసమాప్తియందా సర్వవస్తువులును బ్రాహ్మణులకు ఇచ్చెను. నాకు రెండు సువర్ణ పాత్రలిచ్చెను. వానితో నొక్కటి నీకిత్తును. నాతో రమ్మని తన యా శ్రమమునకు కొని పోయి ఒక పాత్ర వానికిచ్చి "ఓయీ! ఇది ఏ బది కర్షముల సువర్ణముచేత తయారు చేయబడినది. దీనిని అమ్మి ఆ వ్రతమును చేయుము. వ్రత ప్రభావముచే నీకు సమస్త సంపదలు కలుగును. అని చెప్పి యంతర్ధానమునందెను. సువృత్తుడు ఆ పాత్ర గ్రహించి భగవానుడే యిది యంతయుచేసెనని విస్మయమంది



Scanned by CamScanner

ఆనందముతో స్వగృహముచేరెను. చిరకాలమునకు వచ్చిన వానిని చూచి భార్యయు బిడ్డలును పరమానందము సందిరి.

తరువాత నా విప్రుడా పాత్ర నమ్మి ఆ ధనముతో ధాన్యాది ముఖ్య వస్తువులను కొని, బ్రాహ్మణులను, బంధు మిత్రులను పిలిచి భక్తి కలవాడై కల్పోక్త విధిగా నా మహావ్రతమాచరించెను. శక్త్యనుసారము దానములు ఇచ్చెను. బ్రాహ్మణులకు బంధువులకు భోజనములు పెట్టి తృప్తులనుగావించెను. పాత్రను విక్రయింపగా వచ్చిన ధన మంతయు వెచ్చించెను.

ఆతడొకనాడు ఫలములు, పుష్పములు, సమిధలును సంపాదించుటకు వనమునకు పోయెను. అన్నింటిని సమకూర్చి ఒక చెట్టు నీడనుప విష్ణుడయి మనస్సుననిట్లు చింతించెను. "నేను యధోక్తముగా వ్రతము నాచరించినాను కాని సంపదలు కలుగలేదు" అని నిట్టూర్చెను. ఇంతలో ఒక చిత్రమువాని కంటబడినది. ఒక పట్టపుటేనుగు పూలమాలను తొండమున పట్టికొని వచ్చుచుండెను. దానిన వెంబడించి నలుగురు రాజ పురుషులు వచ్చుచుండిరి. క్రమముగా ఆ గజము ఈ బ్రాహ్మణుని సమీపించి ఆ సుమహారమును సువృత్తుని కంఠమున నలంకరించెను. ఆమాలను ఏనుగు ఎవనికి వేయునో అతడే మహారాజగునని ఆదేశము

యుండుటచే ఆచారము వానిన దివ్యాలంకార భూషితుని చేసి నగరమునకు తోడకొనిపోయి సింహాసనమున నుంచి రాజ్యాభిషేకము చేసిరి. ఇది యాదేశపుటాచారము.

వ్రత ప్రభావముచే ఆ పేదపారుడు మహారాజ్యమును పొందెను. తన భార్యాబిడ్డలను పిలిపించి వారితో సహా మహాభోగములు పొందుచు, పుత్రికలకు పుత్రులకును వివాహములు జరిపించి, ధర్మమార్గమున రాజ్య పాలనముచేసి మంచి కీర్తిని పొంది, ఐహికాముష్మికములనో సాధించి వైకుంఠ నగరమును బొందినాడు.

మునులారా! ఈ నిత్యాన్నదాన వ్రత కథను విన్నవారు సర్వపాప విముక్తులయి భోగభాగ్యములు పొందుదురు. అని శౌనకాదులకు సూత మహర్షి చెప్పెను.

స్వస్తి శ్రీ శ్రీ శ్రీ

Scanned by CamScanner